# బీఆర్ఎస్‌లోకి భారీగా వలసలు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

## మంత్రి వేముల సమక్షంలో వివిధ పార్టీల నుంచి చేరిక

వేల్పూర్, నవంబర్ 18 : బీఆర్ఎస్‌లోకి వలసలు జోరుగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. శనివారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వేంపల్లి సొసైటీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు జైడి చంద రవి (కొత్తపల్లి), అంక్సాపూర్ నుంచి బీజేపీ నాయకులు పీఎస్ మల్లయ్య, నేరేళ్ల నడ్పోల్ల రాజన్న, నేరేళ్ల లింగారెడ్డి, దేగాం సత్తయ్య, అగ్గు లింబాద్రి, బద్దం మల్లారెడ్డి, చెంచు కుటుంబాలు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. భీమ్‌గల్ మండలం గోన్‌గొప్పుల గ్రామంలో కాంగ్రెస్, బీజేపీ నుంచి నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ మంత్రి వేముల గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## వేములకు గల్ఫ్ కార్మికుల మద్దతు

వేల్పూర్, నవంబర్ 18: బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి నియోజకవర్గంలోని వంద గ్రామాల గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు శనివారం వేములను కలిసి తీర్మాన పత్రాన్ని అందజేశారు. గల్ఫ్ కార్మికులకు కూడా బీమా వర్తింపజేస్తూ ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దళితబంధు, బీసీ బంధు తదితర సంక్షేమ పథకాలు, గృహలక్ష్మిలో గల్ఫ్ కార్మికులకు ప్రాధాన్యత ఇస్తామని మంత్రి వేముల ఇచ్చిన హామీ మేరకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ 200 మందికి పైగా గల్ఫ్ కార్మికులు గల్ఫ్ కార్మిక సంస్థ అధ్యక్షుడు కోటపాటి నర్సింహ నాయుడు ఆధ్వర్యంలో వేములను కలిశారు. ఇతర నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తామని హామీ పత్రం అందజేశారు.



వేల్పూర్‌లో వేములకు ఏకగ్రీవ తీర్మాన కాపీని అందజేస్తున్న గల్ఫ్‌కార్మికులు

## పేద యువతి పెండ్లికి ఆర్థికసాయం

ఇందల్వాయి, నవంబర్ 18 : మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన మందుల సాయవ్వ కూతురు పెండ్లికి ముదిరాజ్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇమ్మడి గోపి శనివారం రూ.7,300 అందజేశారు. పేద కుటుంబం కావడంతో పుస్తె, మెట్టెల కోసం ఆర్థికసాయం చేసినట్లు చెప్పారు. ఎల్ఐసీ గంగాధర్, మనోహర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నర్సరీల పరిశీలన

ఇందల్వాయి, నవంబర్ 18 : మండలంలోని అన్సాన్‌పల్లి, ఎల్లారెడ్డిపల్లి, లోలం, మల్లాపూర్ గ్రామాల్లో ఎంపీడీవో రాములునాయక్ శనివారం నర్సరీలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఉపాధి పథకం కింద జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. టార్గెట్ మేరకు మొక్కలు పెంచాలని స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలకు సూచించారు.

## నాటక కళను రక్షించుకోవాలి

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 18 : సమాజాన్ని ప్రతిబింబించే నాటక కళారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ నాటక రంగ ప్రయోక్త శ్రీపాద కుమార శర్మ అన్నారు. ఇతిహాస సంకలన సమితి ఇందూరు ఆధ్వర్యంలో శనివారం హరిచరణ్ హిందీ మహావిద్యాలయం ప్రాంగణంలో ఇందూరు నాటక రంగం చరిత్రపై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీపాద నాటక కళాపరిషత్ వ్యవస్థాపకుడు కుమారశర్మ హాజరై సుదీర్ఘ ప్రసంగం చేశారు. సకల కళలకు నిలయమైన ఇందూరు నాటక రంగం ప్రపంచ ఖ్యాతి పొం దిందన్నారు. 1964లో దివంగత ఎస్ఎం. ఎక్బాల్ నేషనల్ ఆర్ట్ అకాడమీ సంస్థను స్థాపించి పునర్జన్మ అనే నాటకాన్ని ఎ. చంద్రప్రకాశ్ దర్శకత్వంలో ప్రదర్శించారని తెలిపారు. 1965లో గౌతమీ కళాసమితి, 1968లో శ్రీ నటరాజ కళానిలయం, 1971లో మురళీకృష్ణ కళానిలయం, 1967లో ప్రొగ్రెసివ్ ఆర్ట్స్ నిజామాబాద్, 1970–80 మధ్యకాలం బాబు కల్చరల్ అసోసియేషన్, 1972లో శారదా కళాసమితి నవీపేట్, 1977లో సిద్దార్థ కళాసమితి బోధన్, 1990లో స్పందన సాంస్కృతిక సంస్థ ఎడపల్లితోపాటు జిల్లా కేంద్రంలో స్నేహమయి తన్మయి ఆర్ట్స్ థియేటర్స్, జాబిల్లి కల్చరల్ అసోసియేషన్, అరుణోదయ సాంస్కృతిక సంస్థ, నగర నటసమాఖ్య తదితర నాటక రంగ సంస్థలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో నాటికలను ప్రదర్శించి ఇందూరు కీర్తిని విశ్వవ్యాప్తం చేశాయని కొనియాడారు. కంప్యూటర్ యుగంలో కళాపోషణ తగ్గి పోవడంతో నాటక ప్రదర్శన కష్టంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నాటక కళను పరిరక్షించుకొని భావితరాలకు అందించడం సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో టీయూ ఆచార్యుడు చందుపట్ల ఆంజనేయులు, డాక్టర్ నాగరాజు, ఇతిహాస సంకలన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్, మోహన్‌దాస్, రిషి తదితరులు పాల్గొన్నారు.

## ఆల్‌ది బెస్ట్



అహ్మదాబాద్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య ఆదివారం వన్డే ప్రపంచకప్ ఫైనల్ జరగనున్నది. ఈ నేపథ్యంలో భీమ్‌గల్‌లోని శ్రీసరస్వతి విద్యామందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు భారత్ గెలవాలని కోరుకుంటూ 'ఆల్‌దిబెస్ట్ డబ్ల్యూసీ 2023' ఆంగ్ల అక్షరాల ఆకృతిలో కూర్చొని శుభాకాంక్షలు తెలిపారు.

–భీమ్‌గల్, నవంబర్ 18



వరల్డ్ కప్ ఫైనల్‌లో భారత క్రికెట్ జట్టు విశ్వవిజేతగా నిలిచి కప్పును కైవసం చేసుకోవాలని కోరుతూ అయ్యప్ప మాలధారులు పూజలు చేశారు. నగరంలోని గంగాస్థాన్ మారుతీ నగర్‌లో శనివారం లక్ష్మీ గణపతి చండీ హోమం నిర్వహించారు. గురుస్వామి మనోహర్, జోషి, శివతేజ, శశికాంత్ గురుస్వామి, మధుసుదన్ తదితరులు పాల్గొన్నారు.

–నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 18

# లింబాద్రి గుట్ట బ్రహ్మోత్సవాలు షురూ



ఉత్సవ మూర్తుల ఊరేగింపులో హారతులు, బోనాలతో పాల్గొన్న భక్తులు

భీమ్‌గల్, నవంబర్ 18: కార్తీక మాసం పురస్కరించుకొని దక్షిణ బద్రీనాథ్‌గా పిలువబడే లింబాద్రి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని గ్రామాలయంలో ఉత్సవ విగ్రహాలకు పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూలతో అందంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవ మూర్తులను ఉంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా గుట్ట పైకి బోనాలు, మంగళ హారతులు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. స్వామి వారి నామస్మరణతో పట్టణం మార్మోగింది. కార్యక్రమంలో పురోహితులు నంబి పార్థసారథి, విజయ్ సారథి, నంబి వాసుదేవాచార్యులు, నంబివేణు, నంబి ప్రణీత్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**28 వరకు బ్రహ్మోత్సవాలు**

జాతర ఉత్సవాలు ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ ధర్మకర్త నంబి లింబాద్రి తెలిపారు. ఈ నెల 22న స్వామి వారి కల్యాణం, 26న జాతర నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## బస్ షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ



నల్లవెల్లిలో బస్సుషెల్టర్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్, వీడీసీ సభ్యులు

ఇందల్వాయి, నవంబర్ 18 : మండలంలోని నల్లవెల్లి గ్రామంలో బస్ షెల్టర్ నిర్మాణానికి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వీడీసీ సభ్యులు మాట్లాడుతూ.. బచ్చు గంగారాం, బచ్చు శ్రీనివాస్ స్మారర్థం బస్ షెల్టర్ నిర్మాణానికి వారి కుటుంబ సభ్యులు బచ్చు ప్రసాద్ ముందుకు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నోముల విజయా లక్ష్మారెడ్డి, వీడీసీ అధ్యక్షుడు మిద్దె నర్సయ్య, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ధర్మపురి, ప్రధాన కార్యదర్శి దాసు, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.